

# చెన్నూర్‌లో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని

చెన్నూర్, జూలై 3: చెన్నూర్ పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వివరాలు, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# 'మహా' సంబురం




సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనప్ప ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మహారాష్ట్ర వాసులు

కౌటాల, జూలై 3 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేట గ్రామ సమీపంలోని వార్ధా నదిపై వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.75 కోట్లు మంజూరు చేశారు. దీంతో మహారాష్ట్రలోని నందివర్ధన్, సమీప గ్రామాల ప్రజలు సోమవారం సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఫ్లెక్సీకి పవిత్ర వార్ధా నదిలోని గంగాజలం, పాలతో గ్రామంలో మహిళలంతా కలిసి అభిషేకం చేశారు. వార్ధా నదిపై వంతెన నిర్మాణం చేపడితే తమ గ్రామాలకు చాలా మేలు జరుగుతుందని, రూ.75 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెనతో తెలంగాణ వెళ్లడానికి తమకు దూర భారం తగ్గుతుందని, అనేక రకాలుగా ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. వార్ధాపై నదిపై బ్రిడ్జి నిర్మాణానికి పట్టుబట్టిన సిర్పూర్ ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ఉండడం అభినందనీయమన్నారు. రైతు రాజ్యంగా తెలంగాణ ముందుకు సాగుతున్నదన్నారు. రాబోయే రోజుల్లో తమ రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ పాలన రావాలని, రైతులకు మేలు జరగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నందివర్ధన్, బంగారమ్మ తలోడి, గోండ్‌పిప్రి సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజనులకు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జూలై 3 : గిరిజనులకు విద్య, వైద్యం అందించేందుకు ప్రత్యేకం దృష్టి సారిస్తానని ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో 61వ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నందున గిరిజన సమస్యలు పూర్తిగా తెలుసన్నారు. మంగళవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సీఆర్టీల నియామకం త్వరలో పూర్తికానున్న నేపథ్యంలో విద్యావ్యవస్థ మరింత పటిష్ట పడనున్నదన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు విధులకు గైరాజరు కాకుండా మూమెంట్ రిజిస్టర్ అమలు చేస్తామని పేర్కొన్నారు. జీసీసీ పెట్రోల్ బంక్ నిర్వహణ సరిగా లేకపోవడంతో పెట్రోల్ దొరకక పడుతున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకరాగా, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ పబ్లిసిటీ అధికారి విష్ణు, సిబ్బంది ఉన్నారు.

# కేసీఆర్ సర్కారుకు అండగా నిలవాలి

- పెద్దపెల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు
- దండేపల్లిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ
- పలు గ్రామాల్లో జీపీ భవనాలకు భూమిపూజ



లక్షెట్టిపేట : కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, జూలై 3 : కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో అండగా ఉండాలని పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. దండేపల్లి తహసీల్ కార్యాలయ ఆవరణలో సోమవారం 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన యువతులు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ప్రవేశపెట్టారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. పసనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ మోటపల్కుల గురువయ్య, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ ఎంపీపీ అనిల్, తహసీల్దార్ హన్మంతరావు, ఆర్ఐ రంజిత్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చుంచు శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులున్నారు.

### జీపీ భవన నిర్మాణాలకు భూమిపూజ

మండలంలోని కాసిపేట, లక్ష్మీకాంతాపూర్, లింగాపూర్, చెల్కగూడ గ్రామాల్లో నూతన జీపీ భవన నిర్మాణాలకు ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతకాని, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమి పూజ చేశారు. లింగాపూర్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మైదం యశోద, బాదినేని సత్యవతి, అజ్మీరా సుగుణ, జాడి తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మంచిర్యాల పట్టణంలో అభివృద్ధి పనులకు..

మంచిర్యాలటౌన్, జూలై 3: మంచిర్యాల పట్టణంలోని 3, 5వ వార్డుల్లో రూ. 34 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు ఎమ్మెల్యే దివాకర్‌రావు భూమి పూజ చేశారు. ఇందులో మూడో వార్డులో రూ.13 లక్షలు, ఐదోవార్డులో రూ.21 లక్షల విలువైన పనులున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయని, ప్రజలకు అవసరమైన పనులన్నీ ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు చెప్పారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, నల్ల శంకర్, మాజిద్, నాయకులు పానగంటి శ్రీనివాస్, షేక్ తాజ్‌బాబా, ప్రశాంత్, మల్యాల శారద, జాబి కళ్యాణి, నస్పూరి భాగ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### లక్షెట్టిపేటలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లక్షెట్టిపేట, జూలై 3: పట్టణంలోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి పథకం ఒక పేదింటి అడబిడ్డకు వరం లాంటిదన్నారు. అనంతరం నాయకులతో కలిసి పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల పెళ్లి చేసుకున్న సుమారు 42 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంగ, డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు చాత రాజు రాజన్న, కోఆప్షన్ సభ్యుడు షాహెద్ అలీ, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సనత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# గోరింట పండింది.. అతివ మురిసింది..



ఆలయంలో ఆషాఢం గోరింటాకుతో ఆర్యవైశ్య సంఘం మహిళలు

పెంచికల్ పేట్, జూలై 3 : తెలంగాణ సంస్కృతిలో మహిళలు గోరింటాకు ధరించడం ఒక ఆచారం. మండల కేంద్రంలోని సంజీవనగర్ శ్రీ కోదండ రామాలయంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆషాఢ మాస గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలంతా కలిసి గోరింటాకు పెట్టుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ.. మహిళలు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా జిల్లా వ్యాప్తంగా ఈ ఆషాఢ మాసంలో గోరింటాకు సంబురాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్వాతి, కోశాధికారి నీలిమ, పెంచికల్‌పేట్ జడ్పీటీసీ సముద్రాల సరిత, సర్పంచ్ కావ్య, ఆర్య వైశ్య సంఘం సభ్యులు రాచకొండ సారిక, సుమిత్ర, పుల్లూరి వనిత, ఉమ, రేణుక, వాణి, సునీత, కాగజ్ నగర్ మహిళా సంఘం సభ్యులు పాలొన్నారు.

# ప్రజావాణితో సమస్యలు పరిష్కారం



దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సీసీసీ నస్పూర్, జూలై 3 : ప్రజావాణి కార్యక్రమంతో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనంలో గల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ప్రజలు సమస్యలతో కూడిన దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేసి పరిష్కరించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలోని 2ఇంక్లైన్‌బస్తీకి చెందిన తోటపల్లి రాజేశ్వర్ తెలంగాణ ధూం ధాం కళాకారుడిగా పనిచేశానని, తనకు జీవనోపాధి కోసం దళితబంధు కేటాయించాలని దరఖాస్తు అందజేశాడు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రజలు తమ భూ సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలను సమర్పించారు. ఒడ్డెర కులస్తులను బీసీ నుంచి ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు దరఖాస్తు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నరేందర్, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.